

పోలీసు స్టేషన్‌లో టిడిపి నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వార్డు తెలుగుదేశం పార్టీ మాజీ కార్పొరేటర్ శేషాద్రి నాయుడు ఏర్పాటు చేయించిన సిమెంట్ బెంచీలను మంగళవారం రాత్రి కొందరు వ్యక్తులు ధ్వంసం చేయడంపై శేషాద్రి నాయుడు, జిజెఎం ట్రస్ట్ ప్రతినిధులు ఈశ్వర్, సాయి, ఆర్ఎస్ నాయుడు, జగన్, సుధాకర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి నియోజకవర్గం సీనియర్ నాయకులు గురజాల జగన్ మోహన్ 10వ వార్డు సత్యనారాయణ పురం ఆటోస్టాండ్ వద్ద వార్డు ప్రజలు, ఆటో డ్రైవర్స్ విజ్ఞప్తి మేరకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. అయితే కొందరు వాటిని ధ్వంసం చేయడం దారుణమని అన్నారు. ఈఘటనపై కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ షేక్షవాలికి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

బాబు, నేను పోటీ చేస్తే 'మీ ఓటు ఎటు'?

- కుప్పంలో నారా భువనేశ్వరి సరదా వ్యాఖ్యలు
- మహిళలపై అత్యాచారాల్లో ఎపి నంబర్ 1
- రామకుప్పం, శాంతిపురంలో అన్నక్యాంటీన్లు ప్రారంభం
- 'నిజం గెలవాలి'లో పలు కుటుంబాలను పరామర్శ
- ఎన్నికల్లో ధీటుగా పోరాడాలని శ్రేణులకు పిలుపు



ప్రజాశక్తి - శాంతిపురం, రామకుప్పం, పుంగనూరు

'నిజం గెలవాలి' నారా భువనేశ్వరి కార్యక్రమం రెండో రోజు కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో సాగింది. శాంతిపురంలో నిజం గెలవాలి కార్యక్రమంలో బుధవారం పాల్గొన్న నారా భువనేశ్వరి సభికులతో సరదాగా గడిపారు. 'చంద్రబాబును 35 ఏళ్లు గెలిపించారు.. ఈసారి నేను పోటీచేస్తే నన్ను గెలిపిస్తారా..?' అంటూ చమత్కరించారు. సభికులు ఇద్దరినీ గెలిపిస్తాం అంటే అలాకాదు ఎవరో ఒకరినే చెప్పాలంటూ సరదాగా సభికులతో మాట్లాడారు. సరదాగా అంటున్నా, నేను చాలా హ్యాపిగా ఉన్నా, రాజకీయాలకు తాను దూరం అంటూ చివర్లో వ్యాఖ్యానించారు. ఎపుడూ సీరియస్ చర్చలే కాదు, అపుడపుడు సరదాగా మాట్లాడుకోవాలన్న ఉద్దేశ్యంతోనే ఈ చర్చ చేసినట్లు చెప్పారు.

మహిళలపై అత్యాచారాల్లో ఎపి నంబర్ 1

మహిళలపై అత్యాచారాల్లో ఎపిని నంబర్ 1గా నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శాంతిపురంలో 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' అంశంపై ముఖాముఖి కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు స్త్రీ అబలగా ఉండేవారని, స్త్రీలకు గౌరవం, ధైర్యం, హక్కులు ఇచ్చి సమాజంలోకి తీసుకొచ్చిన వ్యక్తి అన్న ఎన్టీఆర్ అని అన్నారు. 1986లో ఎన్టీఆర్ స్త్రీలకు ఆస్తిలో సమానహక్కును కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. మహిళలకు ప్రత్యేకంగా తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీని తీసుకొచ్చారన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ అమలు చేశారన్నారు. రాజకీయాల్లో రిజర్వేషన్, డ్వాక్రా సంఘాలను చంద్రబాబు ముందుచూపుతో తీసుకొచ్చారన్నారు. ప్రొద్దుటూరులో ఆరేళ్ల బాలికపై అరవై ఏళ్ల వృద్ధుడు అత్యాచారానికి పాల్పడితే ఆ నిందితుని కఠినంగా శిక్షించాలని చంద్రబాబు ఆర్డర్ వేస్తే, ఆ నిందితుడు ప్రాణభయంతో ఆత్మహత్య చేసుకుని చనిపోయాడన్నారు. దిశ చట్టం కాగితాలకే పరిమితమయ్యిందన్నారు. ఏపీని గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చారన్నారు.

అన్నాక్యాంటిన్ ప్రారంభం

శాంతిపురం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద, రామకుప్పం పోలీసు స్టేషన్ పక్కన అన్నా క్యాంటిన్‌ను ప్రారంభించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పులివర్తి నాని, డాక్టర్ సురేష్, కుప్పం పార్టీ ఇన్చార్జి పిఎస్ మునిరత్నం, చంద్రబాబు పిఏ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు పాల్గొన్నారు.

పలు కుటుంబాల పరామర్శ

పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం కతర్లపల్లి గ్రామంలో, పుంగనూరు నియోజకవర్గం ఎన్ఎస్‌పేటలో, మంగళం, ఒంటిమిట్ట గ్రామాల్లో కార్యకర్త కుటుంబాలను పరామర్శించారు. రాత్రికి మదనపల్లి టికెఎన్ గ్రాండ్ సిటీలో బస చేయనున్నారు. పలమనేరు నియోజకవర్గ పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో టిడిపి కార్యకర్తలు సై అంటే సై అని ధీటుగా పోరాడాలన్నారు.

పెద్దపంజాణి: చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో మనస్థాపం చెంది మండలంలోని మాదనంపల్లి పంచాయతీ కత్తార్లపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప మృతి చెందారు. బుధవారం నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి మండలంలోని మాదనంపల్లి పంచాయతీ కత్తార్లపల్లి గ్రామంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా శంకరప్ప చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయంగా రూ. 3లక్షల చెక్కును అందజేశారు.



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం



అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

ఉపాధి కష్టాలు..



- అందని గరిష్టవేతనం
- కనీస వసతులూ కరువే..
- ఇబ్బందులు పడుతున్న కూలీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

అందరికీ ఉపాధిని కల్పించేలా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం రూపొందించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏ ఒక్కరూ ఉపాధి లేక పస్తులుండరాదనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశం.... జాతీయ ఉపాధిహామీ చట్టం జాబ్ కార్డులను అందజేశారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు... పని పదేశాల్లో కూలీల కోసం కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. వేసవి కాలంలో టెంట్లు ఏర్పాటు, మజ్జిగ ప్యాకెట్లు అందించాలి. వేసవి రోజుల్లో పని చేసే కూలీలకు అదనపు కూలి ఇవ్వాలి. బీజేపి అధికారంలోకి వచ్చాక ఈ చట్టంలో పలు సవరణలు తీసుకొచ్చింది. ఉద్దేశ పూర్వకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేలా సరవణలున్నాయంటూ రైతు సంఘాల నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి.



ఎన్ఆర్ఈజిఎస్ కింద ఉపాధి హామీ పనులు చేస్తున కూలీలకు గరిష్టవేతనం అందడం లేదు. ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలతో నీడ కోసం టెంట్ల ఏర్పాటు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ, తాగునీరు వంటి సౌకర్యాలు లేక సమీప వ్యవసాయ బావుల నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది.

వ్యవసాయ పనులకు వెళ్ళుతున్న కూలీలకు రోజుకు రూ.500లు కూలి దక్కుతోందని ఉపాధి హామీ పనులకు వెళ్ళుతున్నా వారికి పనికి తగ్గ వేతనం లేదంటున్నారు. ఏటా డ్వామా, మండలస్థాయి అధికారులు ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించడం, గరిష్ట వేతనం అందుకునేలా చేయడం లక్ష్యంగా ఉపాధి పనుల ప్రణాళిక తయారు చేస్తుంటారు. గరిష్ట వేతనాన్ని రోజుకు రూ.272లు నిర్ణయిస్తే ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వేతనం పొందలేకపోతున్నారు. గతేడాది నుంచి ఉపాధిహామీ కూలీలకు గుణపాలు, పారలు, టెంట్‌లు ఇవ్వడం నిలిపివేశారు. ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ కూలీలు సాధారణ కూలీల కంటే తక్కువ కూలి పొందుతున్నా ప్రభుత్వం నుండీ ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో పనిప్రదేశాల్లో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి కాలం సమీపిస్తున తరుణంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయకార్మిక సంఘం, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

'ఉపాధి'లో పలు మార్పులు..

ఉపాధి నిధులను కేంద్రం విడుదల చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వీటిని వివిధ పథకాలకు మళ్లిస్తుండటం గమనార్హం. 2022 వరకు టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించేవారు. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ఉపయోగించి మెటీరియల్ కాంపోనెంట్ నిధులు లాక్కుంది. నరేగా నిధులు రాష్ట్ర అవసరాలకు మళ్లించకుండా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ ఇన్ఫర్మెటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) రూపొందించిన పోర్టల్‌లో అన్ని వివరాలు నేరుగా అప్‌లోడ్ చేయాలి. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో ఇది పనిచేస్తోంది. ఈ వ్యవస్థ వచ్చాక పథకం అమల్లో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో పనులకు వెళ్ళేవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనిలోకి వస్తే రూ.272లు వస్తాయని క్షేత్రస్థాయి సిబ్బంది వీరిని తీసుకెళుతున్నా తీరా చేతికొచ్చేది రూ.200, 250లు మాత్రమేనని కూలీలు వాపోతున్నారు.

కూలీ తగ్గడానికి కారణాలివే...

గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించేవారు. ఎన్ని రోజులు పనిచేసినా గరిష్ట వేతనం పొందేవరకు ఒక పని దినంగా చూసేవారు. దీని వల్ల కూలి గిట్టుబాటు కావడంతో పాటు ఎక్కువ రోజులు పనిదొరికేది. ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వచ్చాక ఒక రోజులో ఎంత పనిచేసినా ఒక పని దినం పూర్తయినట్లు లెక్క. దీంతో సరాసరి వేతనం రూ.250లకు మించి రావడం లేదు. కొన్ని మండలాల్లో రూ.100, 150లకి మించడం లేదు. ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తున్న వారికి ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతున్నట్లు డ్వామా అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఇబ్బందులున్నట్లు కూలీలు చెబుతున్నారు. కొలతల్లో కూడా తేడాలున్నట్లు చెబుతున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో ఉపాధిహామీ పనులు చేయడం కష్టం కావడంతో పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు. వేసవి భత్యం పెంచాలని కోరుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

రాజకీయ పార్టీలు సహకరించాలి: డిఆర్ఓ



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ పుల్లయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుత పద్ధతిలో జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య కోరారు. బుధవారం డిఆర్ఓ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను గత నెల 22న విడుదల చేయడం జరిగిందని ఆ తర్వాత పలు దరఖాస్తులు రావడం జరుగుతూ ఉందని వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదికలను ఎన్నికల కమిషన్‌కు పంపడం, అనుమతి పొందిన తర్వాత విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలన అర్హత ఉంటే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉంటుందని అన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో ఈవిఎంలపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బిజెపి నుంచి అట్లూరి శ్రీనివాసులు, సిపిఎం నుంచి గంగరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి భాస్కర్, పరదేశి, బిఎస్పీ నుంచి భాస్కర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి ఉదయ కుమార్, టిడిపి నుంచి సురేంద్ర కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్ బాబు, ఉమాపతి పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేకచర్యలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఒ.ప్రభావతిదేవి ఆధ్వర్యంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు జిల్లా వైద్యఆరోగ్యశాఖ సమావేశం మందిరంలో జిల్లాలోని లాబ్ టెక్నీషియన్లకు రెండురోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా మెదడువాపు నివారణకు కొత్త పద్ధతుల ద్వారా మంచి నైపుణ్యంతో త్వరితగతిన లక్షణాలను పరీక్షించి వ్యాధినిర్ధారణ చేసి సంపూర్ణ చికిత్స ఇచ్చినట్లయితే పూర్తి ఆరోగ్యంగా తయారవుతారని తెలిపారు. అలాగే వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమ్యూనిటీ నందు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై పూర్తిగా అవగాహన కల్పించి లార్వాలు లేని సమాజాన్ని నిర్మించాలి, తద్వారా దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు రావని సూచించారు. డిఐఓ డాక్టర్ రవిరాజు, సబ్ యూనిట్ అధికారులు పీరుసాహెబ్, రామకృష్ణ జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



దోమల నివారణ కరపత్రాలను విడుదల చేస్తున్న డిఎం అండ్‌హెచ్‌ఓ

నగరపాలక సంస్థ బడ్జెట్ అంచనా రూ.274.93 కోట్లు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ 2024-25 సంవత్సరం బడ్జెట్ అంచనాలను రూ.274.93 కోట్లతో రూపొందించినట్లు నగర మేయర్ ఎస్.అముద చెప్పారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం బుధవారం ఉదయం నగరపాలక సమావేశ మందిరంలో మేయర్ ఎస్.అముద అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నగరపాలక సంస్థకు సాధారణ, మూలధన జమల ద్వారా రూ.274,93,45,236.00 వస్తుండగా, రూ. 265,36,67,946.00 సాధారణ మూలధనం వ్యయంగా అంచనా వేశారు.

నగరపాలక కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మధ్యాహ్నం నగర మేయర్ అముద అధ్యక్షతన జరిగింది. సహాయ కమిషనర్ గోవర్ధన్, వార్డు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని, వీధిలైట్లు, డ్రైనేజీలో శుభ్రత, దోమల నియంత్రణ వంటి చర్యల కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించి చర్యలు తీసుకోవాలన్నారు. అజెండా అంశాలపై సభ్యులు చర్చించారు. గిరింపేట మున్సిపల్ పార్కు స్థలంలో స్వతంత్ర సమరయోధులైన మరుదూరు బ్రదర్స్ అయిన పెరియమరుదు, చిన్నమరుదు విగ్రహాల ప్రతిష్టకు, ఈ పార్కుకు మరుదూరు బ్రదర్స్ అయిన పెరియమరుదు, చిన్నమరుదు పేరును పెట్టడానికి కౌన్సిల్ ఆమోదించింది. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పీవీకేఎన్ కాలేజ్ నుండి అంబేద్కర్ భవన్ వరకు రోడ్డును కేబీఆర్ మ్యాంగో భవన్ రోడ్డుగా, కట్టమంచి నుండి సాంబయ్య కండిగ వరకు ఉన్న రోడ్డును డాక్టర్ సీఆర్ రెడ్డి బైపాస్ రోడ్డుగా నామకరణం చేయడానికి, నగరపాలక పరిధిలోని చెరువువీధిని పొన్నుస్వామి నాయకర్ వీధిగా పేరు మార్చడానికి ఆమోదించారు. నగరపాలక సంస్థకు సంబంధించి కూరగాయల మార్కెట్లు, జంతు వధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్లకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నియమనిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించడానికి, అక్రిడేటెడ్ జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సంబంధించి ఇరువారం గ్రామ రెవెన్యూలో గుర్తించిన భూమి భూసర్వే తహశీల్దార్ వారిచే మార్చుటకు కౌన్సిల్ ఆమోదించింది. అజెండాలోని ఇతర అంశాలపైన కౌన్సిల్లో సభ్యులు చర్చించారు. ఈనెల 29న ఉద్యోగ విరమణ చేయనున్న సహాయ కమిషనర్ గోవర్ధన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి, ఎంఈ గోమతి, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, ఏసిపీ రామకృష్ణుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

అంగన్వాడీల జీవోలను వెంటనే విడుదల చేయాలి

యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్




ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: 42 రోజులుగా పోరాటం చేసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఇచ్చిన మినిట్స్ ప్రకారం సమస్యలను పరిష్కారానికి వెంటనే జీవోలు విడుదల చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం నగిరిలో జరిగిన అంగన్వాడి ప్రాజెక్టు సమావేశంకు ధనకోటి అధ్యక్షతన వహించారు. ఈసందర్భంగా గంగరాజు మాట్లాడుతూ అంగన్వాడీల చారిత్రకమైన సమ్మె పోరాటం చేసి అంగన్వాడిలకు అభినందనలు తెలిపారు. పోరాటంతో వందశాతం ఉద్యోగులు ఒక తాటిపైకి వచ్చి ఐక్యంగా ఈ సమ్మెను జయప్రదం చేశారన్నారు. రాష్ట్రంలో కార్మికవర్గానికి మంచి స్ఫూర్తిని కలిగించారని కొనియాడారు. అంగన్వాడీ ఉద్యోగులందరికీ సిఐటియు తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సమ్మె అనుభవాల్ని సమీక్షించుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకున్నామన్నారు. సమ్మె సందర్భంగా అంగీకరించిన ఒప్పందం సంబందించి అంశాలు వెంటనే జీవో ఇవ్వాలని, 42 రోజులు సమ్మె కాలం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలుగా పంచవర్ణ, అధ్యక్షురాలుగా షీలా, కార్యదర్శిగా ధనకోటి, కోశాధికారిగా వనిత, ఉపాధ్యక్షురాలుగా మైథిలి, వరలక్ష్మి, సహాయకార్యదర్శులుగా షర్మిల, అరుణలతో పాటు 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఆర్బీకేలతో బహుళ ప్రయోజనాలు

వెల్‌నెస్ సెంటర్లతో అత్యంత సమీపంలో వైద్యసేవలు: మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఆర్బీకేలతో బహుళ ప్రయోజనాలు రైతులకు అందుతోందని, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు అత్యంత సమీపంలో వైద్యసేవలు అందుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం మండలంలోని వీకేఆర్.పురంలో రూ.21.8 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.8లక్షల నిధులతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు సమీపంలోని ఆర్బీకేల్లోనే అందుతోందన్నారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనం మొదలు పంట అమ్మకం వరకూ సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు పంట రుణాలు, ఇన్స్యూరెన్స్, వ్యవసాయ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. గ్రామసర్పంచ్ నందిని, ఎంపీటీసీ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుదర్శనం నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరి, నాయకులు దేవరాజులు, రవి, భాస్కర్ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ అసోసియేషన్ భవనానికి భూమిపూజ



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగరి ఎలక్ట్రికల్ అసోసియేషన్‌కు స్వంత భవన నిర్మాణానికి మంత్రి ఆర్కేరోజా బుధవారం భూమిపూజ చేశారు. ఓంశక్తి ఆలయ బైపాస్ కూడలి సమీపం ఎలక్ట్రికల్ అసోసియేషన్ భవనం నిర్మించనున్నారు. యేళ్లతరబడి తమకంటూ ఒక స్థలం కావాలంటూ ఎదురుచూసిన ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులకల మంత్రి ఆర్కేరోజా సహకారంతో ఫలించింది. సహకారం అందించడంతో పాటు భూమిపూజలోను మంత్రి పాల్గొనడంతో అసోసియేషన్ సభ్యుల ఆనందం అవదులు దాటింది. మంత్రిని వారు గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సి ఆనంద్‌కుమార్, ఇంద్రయ్య మాట్లాడుతూ ఎలక్ట్రీయన్ పని కోసం నిత్యం నగరి పట్టణంలో అక్కడక్కడా ఎలక్ట్రీషియన్లు తిరుగుతూనే ఉంటారన్నారు. ఒక నిర్ధిష్టమైన స్థలం ఉంటే అందరూ అక్కడే వేచివుంటారని. ఎవరికి ఎలక్ట్రీషియన్ల అవసరమున్నా ఆ ప్రాంతంలో సంప్రదించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ భవనం పలువురు ఎలక్ట్రీషియన్ల జీవనానికి ఆధారమౌతుందన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆమె సహృదయంతో అర్థం చేసుకొని మాకు సహకారం అందించారన్నారు. నేడు భవన నిర్మాణం ప్రారంభిస్తున్నామన్నారు. అసోసియేషన్‌లోని ప్రతి ఒక్కరు మంత్రి ఆర్కేరోజాకు కృతజ్ఞతతో ఉంటామన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం..!



ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిల వలంటీర్ల పనితీరు అభినందనీయమని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. బుధవారం మండల కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సంక్షేమాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల ద్వారా అందుతున్నాన్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లను పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఇందులో ఒకరికి వజ్రసేవా, ఐదు మందికి సేవామిత్రగా ఎంపిక చేశారు. ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచులు మురళి, రాజగోపాల్, కేశవరెడ్డి, పెనువేలు సింహ, తహశీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

శాంతిపురం: మండల పరిధిలోని చౌడంపల్లి హార్టికల్చర్ హబ్‌లో నిర్వహించి వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఆర్‌జె.భరత్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రశంస పత్రాలు, నగదు బహుమతి ప్రభుత్వం అందజేయడం హర్షణీయమన్నారు. ఎంపీపీ కే.వసుంధర కోదండ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి వలంటీర్లు జగన్నాథ రథచక్రాలుగా అభివర్ణించారు. జడ్పిటిసి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ దండపాణి, ఎంపీడీవో రాధాకృష్ణ పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లి: మండలంలో 267 మంది వలంటీర్లకు మండల ఎంపీపీ ఏం.రెడ్డప్ప అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని దేవదొడ్డి వలంటీర్ మేఘనశ్రీ, ధర్మపురి దివ్యసాయి, నెల్లిపట్ల ఉషశ్రీ, లక్కనపల్లి వెంకటేష్, కడపనత్తం సయ్యద్ సిర్ఫాన్ చేసిన సేవలను గుర్తించి సేవరత్న బిరుదు పురస్కారాన్ని బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పలమనేరు ఎమ్మెల్యే ఎం.వెంకటేష్ గౌడు అందజేశారు. ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, వైస్ ఎంపీపీ రూపాయి కుమార్, సర్పంచ్ కొమ్ము వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మా చెరువు గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ..

టిడిపి జెండాలు, తోరణాలు కాల్చివేత



ప్రజాశక్తి- వెదురుకుప్పం: బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ..కార్యక్రమం మండలంలోని మాంబేడు పంచాయతీ ధర్మాచెరువు కాలనీలో బుధవారం మండల పార్టీ అధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ కార్యక్రమంలో హాజరై ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ రాష్ట్రానికి చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు చెంగల్ రాయులు, బి. వెంకట రమణారెడ్డి, గుండయ్య, కిషన్ చంద్, చాణిక్యప్రతాప్, రజిని, శివరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జెండాలు, తోరణాలు కాల్చివేత

మండలంలోని మాంబేడు పంచాయతీ ధర్మాచెరువు కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ కాలనీలో కార్యకర్తలు కట్టిన తెలుగుదేశం పార్టీ తోరణాలు, జెండాలను కొందరు వ్యక్తులు అన్నింటిని తెంపి నిప్పు అంటించారు. ఈవిషయమై డాక్టర్ థామస్ కార్వేటినగరం సిఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పొలాల్లోకి వెళ్లడానికి సర్వీస్ రోడ్డు వేయాలని

హైవే పనులు అడ్డుకున్న రైతులు



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: తమ పొలాలకు వెళ్లడానికి సర్వీసు రోడ్డు వేయాలని బుధవారం కాళేపల్లె వద్ద హైవే రోడ్డుపై లారీలకు అడ్డంగా నిలబడి రైతులు నిరసన తెలిపారు. మండలంలోని చిత్తూరు – తచ్చూరు హైవే రోడ్డుకు పక్కనున్న వరత్తూరు పంచాయతీ చెందిన కాలేపల్లె, బోడపూరు, రాఘవరెడ్డి పల్లె, గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులకు చెందిన భూములకు సర్వీసు రోడ్డు నిర్మించకుంటే తమ పొలాలు సాగు చేసుకోవడానికి అవకాశం లేదంటూ రైతులు రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. దీంతో పాటు పలు రైతులకు భూనష్టపరిహారం, బావులు, చెట్లకు నష్టపరిహారం ఇంతవరకు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని కోరారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామితో పాటు జిల్లా అధికారులు కల్పించుకుని తమకు సర్వీస్ రోడ్డు సౌకర్యం కల్పించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న నష్ట పరిహారం చెల్లించాలని లేకుంటే నిరాహార దీక్షకు సైతం వెనకాడే ప్రసక్తే లేదని రైతులు ధ్వజమెత్తారు.

వాటర్ షెడ్ పనుల పై గ్రామసభ

ప్రజాశక్తి- పులిచెర్ల: భూగర్భ జల సంపదను సక్రమంగా పెంపొందించుకుందామని వాటర్‌షెడ్ పీఓ తేజస్విని, డిఆర్‌పి జ్ఞానేంద్ర రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేటలో వాటర్ షెడ్ పథకంలో చేపట్టిన పనులపై బుధవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మంగళంపేట, బోడిరెడ్డిగారిపల్లె వాటర్ షెడ్డు పరిధిలో 2022– 23 సంవత్సరంలో రూ.1.62 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. ఈ పథకంలో చెక్ డ్యాంలు, ఊట కుంటలు, పశువుల నీటి తొట్టెలు, ఫారంపాండ్లు తదితరు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటిస్తూ పనులను పరిశీలిస్తున్నారని, రికార్డులను తనిఖీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్లు మధు, వాసుదేవ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మండల సమావేశంలో వింత పోకడ

ప్రజాశక్తి- పుంగనూరు: మండల సమావేశంలో ప్రజాప్రతినిధి కాకపోయినా సమస్యలపై అధికారులు నిలదీయడంతో వారు అవాక్కయ్యారు. పుంగనూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు మాట్లాడినప్పుడు ప్రజాప్రతినిధి కాకపోయినా ఓ వైసిపి చోటా నేత ప్రజాసమస్యలపై అధికారులు నిలదీశారు. కపాడం మిట్టపల్లి గ్రామంలో చేతిపంపు మరమ్మతుకు గురైందని, వెంటనే మరమ్మతులు చేయించాలని మండల జేఈని ప్రశ్నించారు. ఈ సంఘటనపై ఎంపీపీ జోక్యం చేసుకొని మండల సమావేశం నుంచి వైసీపీ నేతను పంపించడం జరిగింది. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న తాగునీటి బిల్లులు సరఫరా సంబంధించి మంజూరు కావడం జరిగిందని, మొత్తం బిల్లు క్లియర్ చేసినట్టు తెలిపారు. వేసవికాలం సమీపిస్తుందని మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య ఉండకూడదని, ట్రాన్స్ఫార్మర్ల సమస్య కూడా ఉండకూడదని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి వ్యక్తిగత కార్యదర్శి చంద్రహాస్ అధికారులకు సూచించారు. మండలంలో నాలుగు సబ్‌స్టేషన్లు ప్రారంభించమని, ఇంకను ఇటుక నెల్లూరు, మాగండ్లపల్లి గ్రామంలో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి సైట్ సమస్య ఉన్నందున త్వరలో గుర్తించి అక్కడ కూడా పనులు ప్రారంభిస్తామన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు కొందరు సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్తు ఎప్పుడు ఇస్తారో తెలీదని, పగటిపూట రాత్రిపూట అర్థం కాక రైతులు తీవ్రఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న మండలంలోని గ్రామాల్లో విద్యుత్ వైర్లు ట్రాన్స్ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని స్థానికులు అక్కడ అప్రమత్తంగా ఉండాలని చంద్రహాస్ సూచించారు. విద్యుత్ సమస్యలు మండలంలో ఎక్కడ ఉండకూడదని అలసత్వం చేయకుండా ఎన్నికలలోపు సమస్యలని పరిష్కరించుకోవాలని అన్నారు. సమావేశంలో మూఢ చైర్మన్ ఎన్.వెంకట్ రెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, బోయకొండ అభివృద్ధి ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ నాగరాజురెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరమ్మ, ఎండిఓ మునిరెడ్డి, ఈఓఆర్‌డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'రాస్' సేవలు అభినందనీయం


ప్రజాశక్తి - కార్వేటినగరం: రాష్ట్రీయ సేవా సమితి(రాస్) సేవలు అభినందనీయమని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం ఆవరణంలో మహిళా పొదుపు సంఘాల సౌకర్యార్థం తిరుపతి టాటా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ లతబాలాజీ మాట్లాడుతూ కార్వేటినగరంలో తరచు వైద్య సేవలు అందిస్తూ ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న వ్యాధులకు ప్రతి మూడు నెలలకొక సారి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాగే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వృత్తి శిక్షణలు కల్పించడం, మహిళా సంఘాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న మహిళలకు బాసటగా నిలుస్తున్న రాస్ సేవలు ఎనలేనివని కొనియాడారు. టాటా ట్రస్టు వైద్య నిపుణులు డాక్టర్ వెంకయ్యబాబు మాట్లాడుతూ రాస్ సంస్థ సహకారంతో 2 సంవత్సరాల కాలంలో పుత్తూరు, కార్వేటినగరం పరిసర ప్రాంతాల్లో వివిధ ఆరోగ్య,అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 120 మంది మహిళలు, పురుషులకు పరీక్షలు చేయడం జరిగిందన్నారు. టాటా ట్రస్టు హాస్పటల్ తరుపున బీపీ, షుగర్, హైపటైటీస్, నోరు, రొమ్ము, గర్భసంచి వంటి ఆరోగ్య సమస్యలను పరీక్షలు చేయడం జరిగిందని తెలిపారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డైరెక్టర్ నాగరాజు, రాస్ ప్రాజెక్టు అధికారీ రవి.రాస్ సిబ్బంది ప్రకాష్ ధనలక్ష్మి పాల్గొన్నారు.



- వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ లతబాలాజీ

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అమర్నాథ్ శ్రీనివాసులు



ప్రజాశక్తి- వికోట: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టంతో కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అమర్నాథ్ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రమైన వీకోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాల స్థాయిలో విద్యార్థులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచినప్పుడే భవిష్యత్తుకు మంచి పునాది ఏర్పడుతుందని సూచించారు. కళాశాలలో మౌలిక వసతులు కల్పనకు, అభివృద్ధికి జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు సహకారం ఎంతో తోడ్పాటునందించిందని ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న మోడల్ స్కూల్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు పాఠశాల ఆవరణలో బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సాయిలీల, ఎంఈఓ2 సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. సీఆర్‌పిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: విద్యార్థులు సత్‌ప్రవర్తనతో మెలగాలని జడ్పిటిసి సోమశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు ఆధ్వర్యంలో జరిగింది. కళాశాల సిబ్బంది మురళీమోహన్, అధ్యాపక బృందం హసీనా, శ్రీనివాసులు, చంద్రమోహన్ రెడ్డి, సహనాజ్ తదితరులు పాల్గొన్నారు

గంగవరం: విద్యార్థులు తమ తల్లిదండ్రులు కష్టాన్ని గుర్తించి చదువులో అత్యధిక మార్కులతో మెరిట్ సాధించి తల్లిదండ్రులతో పాటు కళాశాలకు మంచి పేరు తేవాలని మధు అండ్ శ్రీవాణీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మధు అండ్ శ్రీవాణీ విద్యాసంస్థలలో కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఆనంద రెడ్డి, గోపీనాథ్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యజమాన్యం

ప్రపంచ పరిజ్ఞానానికి అనుగుణంగా మారాలి

అపోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి



ఎంబిబిఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందిస్తున్న సంగీతారెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి హాజరయ్యారు. డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్‌సైన్సెస్‌తో అనుబంధంగా ఉన్న ఏఐఎంఎస్ఆర్ తన రెండవ బ్యాచ్ ఎంబిబిఎస్ విద్యార్థుల స్నాతకోత్సవం ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంవత్సరం 74 మంది బాలికలు, 72 మంది బాలురు మొత్తం 146 మంది విద్యార్థులు తమ ఎంబిబిఎస్ డిగ్రీలను విజయవంతంగా పూర్తి చేసి ప్రశంసనీయమైన పనితీరును ప్రదర్శించారని తెలిపారు.ఈ సందర్భంగా సంగీతా రెడ్డి మాట్లాడుతూ సమగ్ర స్వరూపం గురించి ఉటంకిస్తూ అభివృద్ధి చెందుతున్న కాలంతో పాటు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మారాలని విషయాన్ని హైలైట్ చేశారు. విద్యార్థులు, అధ్యాపకులకు ఈ పరివర్తన ద్వారా ఎదురయ్యే సవాళ్లను ఆమె తెలిపారు. 2018 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ పాత కరిక్యులమ్‌లోని చివరి కోహోర్ట్‌ను సూచిస్తుందని, ఇది ఒక సంతోషంతో కూడిన వీడ్కోలును సూచిస్తుందన్నారు. అపోలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్ హెచ్ భట్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విద్య కోసం అంతర్జాతీయ విద్యార్థుల రాకను అంచనా వేస్తూ సంస్థ భవిష్యత్తు కోసం డాక్టర్ ప్రతాప్ రెడ్డి గొప్ప దూరదృష్టిని అభినందించారు. సీఈఓ శివరామకృష్ణన్, సీఓఓ నరేష్ కుమార్‌రెడ్డి, డాక్టర్ ఆల్‌ఫ్రెడ్, ఎంఎస్, డాక్టర్ సుధాకరబాబు, హెచ్‌డీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టా పొందినందుకు పట్టభద్రుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు సంతపేటలో గల బృందావన్ స్కూల్‌లో హరివిల్లు కళావేదిక వారు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అతిథులుగా భాషాభూషణ గొల్లపిన్ని సుబ్రహ్మణ్య శర్మ, విశ్రాంత గణాంకాధికారి ఏపీఎస్ ఆర్టీసీ విద్వాన్ బి.భాస్కర్ రెడ్డి, హరివిల్లు అధ్యక్షులు హరినాయుడు, గోవిందన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి, అతిథులు శ్యామలాదేవి పిల్లలకు మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. నేటి కాలంలో పిల్లలు తెలుగు పట్ల ఆ శ్రద్ధ చూపుతున్నారని, మన అమ్మ బాషను మనమే కనుమరుగు చేసుకునే స్థితి వచ్చిందన్నారు. ఇకనైనా మాతృభాషను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ఉద్యమాల ద్వారా పోరాటాలు చేయడమే ఏకైక మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి యుటిఎఫ్ భవనంలో జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉద్యమ చైతన్య సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న అనేక సౌకర్యాలు గతంలో ఉద్యమాల ద్వారానే సాధించుకున్నామని, అనేక మంది త్యాగాల ఫలితంగా ఈరోజు మనం ఎన్నో రకాల ఆర్థిక, సర్వీసు పరమైన సౌలభ్యం పొందుతున్నామన్నారు.రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం 12 వ పిఆర్‌సి ప్రకటించినప్పటికీ ఇంతవరకు విదివిధానాలు ఖరారు చేయలేదన్నారు. ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ సంఘాల ఉమ్మడి వేదిక పిలుపు మేరకు ఈనెల 27 న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఉద్యమ చైతన్య సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కోశాధికారి రమేష్ నాయుడు, కార్యదర్శులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్ రెడ్డి, అవనిగడ్డ పద్మజ, సురేష్, శేఖర్, గీతమ్మ పాల్గొన్నారు

సంక్షిప్త వార్తలు

ఇన్‌ఛార్జి ఎంపిడిఓగా రాజశేఖర్ బాబు



ప్రజాశక్తి- సదుం: పులిచెర్ల ఈఓఆర్‌డిగా పనిచేస్తున్న జి.రాజశేఖర్ బాబు సదుం ఇన్‌ఛార్జి ఎంపిడిఓగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఓ వరప్రసాద్, సదుం మేజర్ ఈఓఆర్‌డిగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.

దుర్గమాంబ ఆలయ కుంభాభిషేకం

ప్రజాశక్తి- వీకోట: మండల కేంద్రమైన వికోటలో వెలసిన దుర్గమ్మ ఆలయం వద్ద అత్యంత వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయ కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన అనంతరం దుర్గా హోమం నిర్వహించారు. అలాగే దుర్గమ్మ ఆలయాన్ని నిర్మించి పుష్కరకాలం దాటిన నేపథ్యంలో బుధవారం ఆలయ కుంభాభిషేకం.. దుర్గా మల్లేశ్వరస్వామి కళ్యాణోత్సవం కనుల పండుగ నిర్వహించారు. కంకణబద్ధులైన 108 దంపతులు అమ్మవారికి సారెతో పాటు పూజాసామాగ్రిని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు దంపతులతో పాటు యాగాన్ని తిలకించేందుకు మండల పరిసరాల నుంచి పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం రాజు, నిర్మాణ కమిటీ చైర్మన్ దామోదర్ రెడ్డి తెలిపారు. ఆలయాన్ని ఎమ్మెల్యే వెంకటే గౌడ, రాష్ట్ర మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: మున్సిపల్ పరిధి, సత్రవాడలోని పాంచాలీ సమేత పాండవ ఆలయంలో కుంభాభిషేక వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో హోమపూజలు, కలశ పూజలు నిర్వహించారు. కుంభాభిషేక వేడుకల్లో మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కుంభాభిషేకాన్ని వీక్షించిన అనంతరం మంత్రి పాంచాలమ్మను, పాండవులను దర్శించుకొని భక్తిశ్రద్ధలతో అర్చనలు చేసుకున్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారులకు ప్రశంసలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆడుదాం ఆంధ్ర 2023 ఫైనల్ పోటీలలో గెలుపొందిన తిరుపతి జిల్లా క్రీడాకారులను కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ ప్రశంసించారు. ఈ నెల 9 నుండి 15 వరకు విశాఖపట్నం నందు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడదాం ఆంధ్ర ఫైనల్ పోటీలలో కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగం ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమని అన్నారు. విజేతలకు ట్రోఫీ, సిల్వర్ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎ.సుమన్, సతీష్‌లకు మూడు లక్షలు, కబడ్డీ క్రీడాకారులకు 25వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేసినట్లు క్రీడాభివృద్ధి అధికారి సయ్యదర్ సాహెబ్ తెలిపారు. డిఇఒ శేఖర్ పాల్గొన్నారు.

మండుటెండలో నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - క్యాంపస్: ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద సేవ కార్మికులు కనీస వేతనం పెంచాలంటూ మండుటెండలో మలమల మాడుతూ నడిరోడ్డపైనే అన్నం తింటూ నిరవధిక సమ్మెను కొనసాగించారు. సిఐటియు నాయకులు ఎస్.జయచంద్ర, రాష్ట్ర కోశాధికారి నాగ వెంకటేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. అగ్రికల్చర్ పరిధిలో వివిధ రీసెర్చ్ స్టేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్‌ను ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలన్నారు. ఏడాదంతా పనిచూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వరలక్ష్మి, రాకేష్, చంద్రమ్మ, సుబ్బు, ముని, లక్ష్మి, రాధా, రేవతి పాల్గొన్నారు.

3న పల్స్‌పోలియోను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలోని 0 – 5 సంవత్సరాల లోపు పిల్లలు అందరికి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం హాల్ నందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, డి ఈ ఓ. శేఖర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి జయలక్ష్మి, డి ఐ ఓ శ్రీనివాసులు లతో కలసి మార్చి 3 న (ఆదివారం) నిర్వహించే జాతీయ పోలియో కార్యక్రమానికి సంబందించి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ తో నిర్వహించిన సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో 0 – 5 సంవత్సరాల లోపు 2,53,282 మంది పిల్లలకు 3,36,860 డోసులు రావడం జరిగిందని. జిల్లాలో మొత్తం1824 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. గోడపత్రికను ఆవిష్కరించారు.

మామిడికి తేలికపాటి నీటి తడులు అవసరం

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: ప్రస్తుతం మామిడి తోటలు పిందె దశలో వున్నాయని, ఈ సమయంలో తేలిక పాటి తడులు అందిస్తే నాణ్యమైన దిగుబడిని పొందవచ్చని మండల ఉద్యానశాఖాధికారి శివకుమారి రైతులకు సూచించారు. బుధవారం చిన్నగొట్టిగళ్ళు పరిధిలోని మామిడి తోటలను పరిశీలించారు. మామిడిలో ప్రస్తుతం అక్కడక్కడ పిందెలు ఏర్పడి ఉన్నాయి. తప్పనిసరిగా తేలికపాటి నీటి తడులు ఇస్తే కాయ పరిమాణం, నాణ్యత పెరుగుతుందని తెలిపారు. అక్కడక్కడ ఇగురు గాని, పూత గాని రాని తోటల్లోనూ నీటి తడులు తేలికపాటిగా ఇచ్చినప్పుడు ఏదో ఒక రూపంలో పూతగాని ఇగురు గాని వచ్చే అవకాశం ఉందన్నారు. ఎండల వల్ల పిందెలు పసుపు రంగులోకి మారి రాలిపోవడం జరుగుతుందని, దీని నివారణకు సున్నం 5 గ్రాముల నుండి 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే నివారించ వచ్చని తెలిపారు.

చాముండేశ్వరి ఆలయ ట్రస్టు నూతన కమిటీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని భాస్కరపేటలో ఉన్న చాముండేశ్వరీ దేవి ఆలయ ట్రస్టు నూతన కమిటీని ఈ నెల 19న ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షులుగా చల్లా జయరామయ్య, ఉపాధ్యక్షులుగా సజ్జా చంద్రయ్య, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పులి రవీంద్రబాబు, కోశాధికారిగా గుంటూరు నాగభూషణం నియమితులయ్యారు. గతంలో పనిచేసిన ట్రస్టు ఛైర్మన్ అవినీతికి పాల్పడటంతో ఆయన్ను తొలగించి తిరిగి కొత్త కమిటీని ఎన్నుకున్నామని జయరామయ్య తెలిపారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన నటరాజన్ కుటుంబం బుధవారం రూ.50 వేలు విరాళంగా అందజేసింది. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేసి అన్నదాన పథక నిర్వహణకు ఖర్చు చేయాలని సూచించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామీ అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు.